క్లుప్తంగా

వైద్యశిబిరం



మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ ఆచార్య

దుగ్గొండి : మండలంలోని కేశవాపురం పీహెచ్‌సీ పరిధిలోని నాచినపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో భారత్ అభియాన్ గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 ఏళ్ల పైబడిన, షుగర్‌తో బాధపడుతున్న, దురల వాట్లకు బానిసలుగా మారిన వారితోపాటు టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం భారత్ అభియాన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆచార్య మాట్లాడారు. శిబిరాన్ని వృద్ధులు, రోగులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌కుమార్, ఉపకేంద్ర వైద్యాధికారి హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు..

తహసీల్దార్లుగా రమేశ్, ఆబిద్



రమేశ్



ఆబిద్ అలీ

ఖానాపురం /నర్సంపేట : ఖానాపురం, చెన్నారావుపేట తహసీల్దార్లుగా ఎస్.రమేశ్, మహ్మద్ ఆబిద్ అలీ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయా స్థానాల్లో పని చేసిన తహసీల్దార్లు బదిలీ కావడంతో రమేశ్, ఆబిద్‌ను మండలానికి ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ సందర్భంగా వారికి ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



పర్వతగిరి : మండల కేంద్రంలో ముగ్గు పోసుకున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ శంకర్‌నాయక్ గురువారం పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేసుకొని బిల్లులు పొందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ శేషు, ఇన్‌చార్జ్ కార్యదర్శి మాధవుడు, కారోబార్ మేడిశెట్టి కరుణాకర్, కంప్యూటర్ ఆపరేటర్ షబానా, తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

సంగెం : ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఎల్గూరు రైల్వేస్టేషన్ యార్డు (హోం సిగ్నల్) వద్ద గురువారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. సుమారు 30–40 ఏళ్ల వయస్కుడైన గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. మృతుడు నలుపు రంగు జీన్ ప్యాంట్, బ్రౌన్ కలర్ టీ షర్టు ధరించి నల్లని తలవెంట్రుకలు, గడ్డం, మీసాలు కలిగి ఉన్నాడు. మృతుడి వద్ద కాజీపేట నుంచి నెక్కొండ వరకు తీసుకున్న రైల్వే టికెట్ లభించిందని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వ్యక్తులు వరంగల్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సెల్ నంబర్ 9440361941లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



వర్ధన్నపేట : విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని ఇల్లంద శివారులో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన రైతు బొంతల అనిల్ సాకుతున్న ఎద్దు మేతకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలింది. దీంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.60 వేలు ఉంటుందని వాపోయాడు. తనకు పరిహారం అందించాలని బాధిత రైతు ప్రభుత్వాన్ని కోరాడు.

ఎంఎల్‌టీ బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

పర్వతగిరి : మండలంలోని కేజీబీవీలో ఇంటర్ విద్యార్థులకు కాంట్రాక్టు ప్రాతిపదికపై మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్‌టీ) కోర్సు బోధించేందుకు అర్హత కలిగిన మహిళా అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సల్మా, మండల విద్యాధికారి (ఎంఈఓ) గాయపు లింగారెడ్డి గురువారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. దరఖాస్తుదారులు ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ, ఎండీ పాథాలజీ, బి ఫార్మసీ, ఎంఎస్సీ (జన్యుశాస్త్రం), ఎంబీబీఎస్, బీహెచ్‌ఎంఎస్, పీజీడీ క్లినికల్ బయో కెమిస్ట్రీ అర్హత కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు పాఠశాలలో ఈనెల 13 నుంచి 17 మధ్య దరఖాస్తు అందజేయాలని కోరారు.

ఆర్థికసాయం

ఖానాపురం : మండలంలోని కొత్తూరుకు చెందిన సాయికుమార్ సుమారు 7 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రూ.4.20 లక్షల సాయం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ మండల అధ్యక్షుడు తడుగుల స్వామి మాట్లాడారు. సాయికుమార్‌కు అసోసియేషన్‌లో సభ్యత్వం ఉండడంతో రాష్ట్ర, జిల్లా కమిటీల సహకారంతో కుటుంబ భరోసా కింద సాయం అందజేసినట్టు తెలిపారు.

అవగాహనతోనే అధిక దిగుబడులు

- ఎరువులు, విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు కీలకం
- మండల వ్యవసాయ అధికారి నాగరాజు



నెక్కొండ : రైతులు పంటల సాగులో అవగాహన కలిగి ఉంటే అధిక దిగుబడులు సాధించగలరని వ్యవసాయ అధికారి (ఏఓ) ఎగిడి నాగరాజు తెలిపారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలులో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. మండలంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఈ సమయంలో విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు కీలకం. అజాగ్రత్తగా వ్యవహరిస్తే నకిలీ, నాసిరకం రూపంలో ప్రమాదం పొంచి ఉంది. రైతులు ఆరుగాలం చేసిన కష్టం బుడిదలో పోసిన పన్నీరే అయ్యే ప్రమాదం ఉంది. కొద్ది రోజులుగా ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలులో ఏఓ సూచనలు, సలహాలు..

విత్తన కొనుగోలు ఇలా...

ప్రభుత్వ లైసెన్స్ పొందిన డీలర్ల నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలి. బిల్లుపై నంబరు, రకం, గడువు, డీలరు సంతకం నమోదు చేయించాలి.

లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయొద్దు. విత్తనాల గడువును పరిశీలించాలి.

బిల్లుపై విక్రయదారు పేరు, కేంద్రం, రాష్ట్ర అమ్మక పన్ను నంబరు, రైతు పేరు, గ్రామం పేరు, విక్రయదారు సంతకం, తేదీలు, రకం పేరు, బ్యాచ్ నంబరు, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు నమోదు చేయించుకోవాలి.

విత్తన ప్యాకెట్, పురుగు మందుల సీసా, సంచి, డబ్బాలపై సీలు తప్పనిసరిగా ఉండాలి. విక్రయదారు ఇచ్చే కరపత్రాల్లోని అంశాలను అధ్యయనం చేయాలి.

కొనుగోలు చేసిన సరుకును డీలరు వద్దే తూకం వేయించాలి. మొలకెత్తే, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే అధికారిని సంప్రదించాలి.

విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లును పంట కాలం పూర్తి అయ్యే వరకు భద్రపర్చాలి. అప్పుపై కొనుగోలు చేసినప్పటికీ బిల్లు ఉండాల్సిందే.

విత్తనాలు తీసుకున్న వెంటనే మొలక శాతాన్ని చూసుకోవాలి. మొలక శాతం సంతృప్తికరంగా ఉంటేనే కొనుగోలు చేయాలి.

పురుగుల మందుల కొనుగోలు..

చీడపీడల నివారణకు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన క్రిమిసంహారక మందులు మాత్రమే కొనుగోలు చేయాలి.

నిల్వ ఉంచిన పురుగు మందులను వాడొద్దు. రెండు, మూడు రకాల పురుగు మందులు కలిపి వాడొద్దు. వాడిన డబ్బాలు, సీసాలను ధ్వంసం చేసి గుంతలో పూడ్చాలి.

పురుగు మందుల వినియోగానికి ఉపయోగించిన పాత్రలను ఇతర అవసరాలకు వినియోగించొద్దు.

కల్తీ ఎరువుల గుర్తింపు ఇలా..

యూరియా, కాల్షియం, అమ్మోనియం, నైట్రేట్ వంటి కాంప్లెక్స్ ఎరువులు గుళికల రూపంలో ఉంటాయి. 15:15:15, 20:20:20 ఎరువులు రేణువుల రూపంలో ఉంటాయి. పొటాష్, సూపర్ ఫాస్ఫేట్ పొడి రూపంలో ఉంటాయి. 15:15:15, 28:28:0, 19:19:19, 17:17:17, 24:24:0, యూరియా వంటి ఎరువులను ఒక చెంచాను 5 మిల్లీలీటర్ల పరిశుభ్రమైన నీటిలో కలిపితే అడుగున మడ్డి చేరితే కల్తీ. కొన్ని కాంప్లెక్స్ ఎరువులను ఇలా పరీక్షిస్తే ఇసుక రేణువులు వస్తే కల్తీ జరిగిందని గుర్తించొచ్చు.



షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

5 మిల్లీలీటర్ల నీటిలో చెంచా ఎరువు వేసి కలపాలి. అది స్వచ్ఛమైన ద్రావణంలా ఉంటే నాణ్యమైనదిగా భావించొచ్చు. యూరియా, క్లోరైడ్ ఎరువుల పరీక్షకు 10 మిల్లీలీటర్ల శుభ్రమైన నీటిని వాడాలి.

ఎరువుల కొనుగోలులో జాగ్రత్తలు...

మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులు మాత్రమే వినియోగించాలి. చేతి కుట్టు ఉంటే సీసం సీల్ పరిశీలించాలి. ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తిదారు పేరు ఉండాలి.

కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే అధికారి సహకారంతో పరీక్షకు పంపాలి.

చిల్లులు పడిన, చిరిగిన ఎరువుల బస్తాలు కొనుగోలు చేయొద్దు. ఇతర పదార్థాలు కలిస్తే కల్తీగా గుర్తించాలి.

ప్రత్యామ్నాయ పంటల సాగు మేలు



గీసుకొండ : మాట్లాడుతున్న శాస్త్రవేత్త సౌమ్య



ఖానాపురం : మాట్లాడుతున్న ప్రొఫెసర్ అర్చన



నెక్కొండ : మాట్లాడుతున్న శాస్త్రవేత్త హరి

- శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రాజు

గీసుకొండ : వరికి బదులు ప్రత్యామ్నాయ పంటల సాగు మేలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రాజు, డాక్టర్ సౌమ్య తెలిపారు. మండలంలోని బొడ్డుచింతలపెల్లి, కోనాయమాకుల, శాయంపేట హవేలీలో గురువారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి వారు అతిథులుగా హాజరై మాట్లాడారు. పంటల సాగుపై అవగాహన కలిగించారు. ఎరువులను మోతాదు మించి వేయొద్దని చెప్పారు. కార్యక్రమాల్లో జూనియర్ వెటర్నరీ అధికారి నాగరాణి, ఏఓ హరిప్రసాద్, ఏఈఓలు సంపత్, కావ్య, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలో వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు దీపిక, అర్చన మాట్లాడారు. యూరియా అధిక వినియోగంతో ఆమ్ల తత్వం పెరిగి భూమిలోని సూక్ష్మ జీవులు నశిస్తాయని తెలిపారు. సమావేశంలో ఏఓ శ్రీనివాస్, ఏఈఓలు రాజ్‌కుమార్, అంకూషా వలీ తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని కల్లెడలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రాములు, డాక్టర్ పి.ప్రశాంత్ మాట్లాడారు. పంటల మార్పిడి పాటించి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. వరికి ముందు పచ్చిరొట్ట పంట వేయాలని, వరికి తర్వాత పెసర్లు, బొబ్బెర్లు, మినుముల సాగుతో పప్పు దినుసులు అవసరాలు తీరుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు టీవీఆర్‌ఆర్.ప్రశాంత్, బి.చందులాల్, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని తోపనపల్లి, పెద్దకోర్పోలు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మధు, హరి, కమలాకర్, సుహాసిని మాట్లాడారు. యాసంగిలో ఆముదం, కుసుమ, నూనె గింజలు సాగు పెంచి లాభాలు పొందాలని చెప్పారు. సమావేశంలో ఏఓ నాగరాజు, ఏఈఓలు అరుణ్‌కుమార్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఓంప్రకాశ్, మాధవి మాట్లాడారు. రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, ఏఓ గుమ్మడి వీరభద్రం, ఏఈఓలు రాజేశ్, సాయి, మనస్విని, క్రాంతి కుమార్, కావ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఐఎఫ్‌పీబీ బోధన

- ఎంఈఓ గాయపు లింగారెడ్డి



పర్వతగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో ఐఎఫ్‌పీబీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డు) ద్వారా బోధన చేస్తున్నట్లు ఎంఈఓ గాయపు లింగారెడ్డి తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో గురువారం ఆయన సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఐఎఫ్‌పీబీ ద్వారా విద్యార్థులకు సులభతరమైన విద్యాబోధన చేయనున్నట్లు తెలిపారు. గత సంవత్సరం గోపనపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏఐ విద్యావిధానం అమలు చేశామని, ఈ సంవత్సరం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలులోకి రానున్నట్లు వివరించారు. గత సంవత్సరం పదో తరగతిలో 88 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. పర్వతగిరి హైస్కూల్‌లో 518 మార్కులు, గోపనపల్లి హైస్కూల్లో 513 మార్కులు సాధించి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. బడిబాట ద్వారా 327 మంది విద్యార్థులను చేర్పించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు విద్యార్థులకు అందించనున్నట్లు ఆయన చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ లింగయ్య కోరారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

- ఎంపీటీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ అశోక్

రాయపర్తి : మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మొరిపిరాల ఎంపీటీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ నంగునూరి అశోక్ శ్రేణులను కోరారు. మండలంలోని కిష్టాపురంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు అన్ని స్థానాల్లో గెలుచుకోవాలని ఆకాంక్షించారు. ఆ దిశగా పార్టీని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, చేపడుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు విష్ణుమూర్తి, నాయకులు గౌరారపు దేవేందర్, మేడిద మహిపాల్, వల్లపు వెంకన్న, కునుసోతు శ్రీను, ప్రభాకర్‌రెడ్డి, గద్దల రాజు, గిద్దె ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

గీసుకొండ : మండలంలోని వరంగల్–నర్సంపేట రహదారిలో కారును గూడ్స్ వాహనం ఢీకొట్టగా పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మామునూరు సమీపంలోని తిమ్మాపూర్‌కు చెందిన రవీందర్‌రెడ్డి, ఆయన భార్య మమత, తండ్రి రాంచంద్రారెడ్డి, తల్లి ఎలేంద్ర, కూతురు విద్య కలిసి కారులో ముత్తోజిపేటలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్తుండగా నర్సంపేట వైపు నుంచి మిర్చి బస్తాల లోడ్‌తో వస్తున్న గూడ్స్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారికి గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల బంధువు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మహేందర్ తెలిపారు.

పరామర్శ

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండ గ్రామానికి చెందిన గీత కార్మికుడు మడూరి రమేశ్ ఇటీవల తాటిచెట్టు నుంచి కాలుజారి కిందపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏకాంతం గురువారం పరామర్శించారు. తొలుత ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడారు. రమేశ్ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. రమేశ్‌కు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చీమల భిక్షపతి యాదవ్, బీజేపీ జిల్లా ప్రతినిధి కుడికాల శ్రీధర్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బత్తిని దేవేందర్, మడూరి కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



మంత్రి లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న నర్సింహ, శ్రీకాంత్

వర్ధన్నపేట : రాష్ట్ర సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, పశు సంవర్ధక శాఖ, యువజన వ్యవహారాలు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిలను బహుజన రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు వశపాక నర్సింహ, జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ గురువారం శాలువాలతో సన్మానించారు. మంత్రులను నర్సింహ, శ్రీకాంత్ హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్‌లో కలిశారు. పూలమొక్క అందించి సత్కరించారు. నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

విత్తనం మొలకెత్తించడంలో అన్నదాతల పాట్లు



దుగ్గొండి : ముందస్తు రుతు పవనాలు రైతులను పలకరించాయి. వర్షాలు కురవడం మొదలైంది. 4 రోజులు మురిపించిన వానలు 15 రోజులుగా ముఖం చాటేశాయి. వర్షం కురుస్తుందన్న ఆశతో రైతులు పత్తి విత్తనాలు నాటారు. వర్షం కురవని దుస్థితిలో ప్రత్యామ్నాయ మార్గాల్లో చేనుకు నీరు పెడుతూ విత్తనాన్ని మొలకెత్తించే పనిలో పడ్డారు. కొందరు నేరుగా నీరు పారిస్తుండగా ఇంకొందరు డ్రిప్, స్ప్రింక్లర్ విధానంలో నీరు అందిస్తున్నారు.

కప్పతల్లి ఆట



గీసుకొండ : మండలంలోని గంగదేవిపల్లిలో వరుణుడు కరుణించాలని కోరుతూ రైతులు గురువారం కప్పతల్లి ఆట ఆడారు. సాధారణంగా ఈనెల మొదటి వారంలో వర్షాలు కురిస్తే విత్తనాలు వేయాలని రైతులు ఆశించగా వరుణుడు ముఖం చాటేయడంతో ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వర్షాలు కురవాలని వరుణుడికి పూజలు చేశారు.

మహిళల రక్షణే 'సఖి' ధ్యేయం



గీసుకొండ : మహిళలు, బాలికల రక్షణే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి సెంటర్లను నిర్వహిస్తున్నాయని సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శోభారాణి తెలిపారు. మండలంలోని ధర్మారం, గంగదేవిపల్లి గ్రామాల్లో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, సఖి సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళల హక్కులు, పరిరక్షణ చట్టాలపై మహిళా సంఘాల సభ్యుల కోసం గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. సఖి కేంద్రాల్లో బాధిత మహిళలు, బాలికలకు ఉచిత వసతి, న్యాయ, కౌన్సెలింగ్, ఇతర సేవలు అందుతాయని చెప్పారు. మహిళలు సఖి కేంద్రాల్లో లభిస్తున్న సేవలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. తొలుత కరపత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వీఓఏలు జనార్ధన్, మణిమాల, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య



నర్సంపేట రూరల్: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందిస్తున్న ఎంఈఓ సారయ్య

- ఎంఈఓ సారయ్య

నర్సంపేట రూరల్ : ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్య అందుతుందనిఎంఈఓ కొర్ర సారయ్య, మండల వ్యవసాయ అధికారి కృష్ణ కుమార్ తెలిపారు. నర్సంపేట మండలంలోని మహేశ్వరం, గురిజాల గ్రామాల్లో గురువారం బడిబాట నిర్వహించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనస్వాగతం పలికారు. విద్యార్థులకు యూనిఫామ్, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు అందజేశారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు స్వరూప, అర్పిత, సరిత, పార్థసారధి కార్యదర్శి శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని మొండ్రాయి జెడ్పీ స్కూల్, గవిచర్ల మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ సీఎంఓ సుభాష్, ఎంఈఓ జి.రాము, హెచ్‌ఎం విజయ, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండలంలోని పాఠశాలలను అందంగా అలంకరించారు. కొత్తగా స్కూళ్లలో చేరిన, తొలిరోజు హాజరైన విద్యార్థులకు ఉపాధ్యాయులు పుష్పాలు అందించి స్వాగతం పలికారు. ఎంఈఓ అనురాధ పలు స్కూళ్లను సందర్శించారు. నూతన ప్రవేశాలపై హెచ్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు.



నల్లబెల్లి : నందిగామ హైస్కూల్‌లో..



దుగ్గొండి : దేశాయిపల్లిలో..

దుగ్గొండి : మండలంలోని దేశాయిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఎంఈఓ వెంకటేశ్వర్లు నోట్‌బుక్కులు, పుస్తకాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బోధించడానికి ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మూడో విడత 'దోస్త్' ప్రారంభం

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నవీన్

నర్సంపేట : తెలంగాణ ఉన్నత విద్యామండలి ద్వారా డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పించే దోస్త్ మూడో విడత అడ్మిషన్ల ప్రక్రియ నేడు (శుక్రవారం) ప్రారంభమం కానుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ తెలిపారు. ఆయన కళాశాలలో మీడియాతో గురువారం మాట్లాడారు. రెండో విడతలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిపోర్ట్ చేయాలని సూచించారు. దోస్త్ నమోదు ప్రక్రియలో ఇబ్బందుల తలెత్తితే కళాశాలలోని సహాయక కేంద్రంలో పరిష్కరిస్తారని వెల్లడించారు. మూడో విడత ప్రవేశాలకు ఈనెల 19న వరకు గడువు ఉందన్నారు. జూన్ 30వ తేదీ నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం అవుతాయని వివరించారు. విద్యార్థులు ఆధార్ మొబైల్ నంబర్‌కు అనుసంధానం అయి ఉండాలని, దోస్త్ రిజిస్ట్రేషన్ కోసం పదో తరగతి మెమో, ఇంటర్ రెండో సంవత్సరం హాల్ టికెట్ నంబర్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, 3వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు స్టడీ సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని కోరారు. సమావేశంలో దోస్త్ సమన్వయకర్త డాక్టర్ పూర్ణచందర్, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అకాడమిక్ కోఆర్డినేటర్ కందాల సత్యనారాయణ, అడ్మిషన్ ఇన్‌చార్జ్ డాక్టర్ సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

- వన ప్రేమి, సామాజిక వేత్త రామస్వామి



ర్యాలీ ప్రారంభిస్తున్న రామస్వామి, కాంతారావు

నర్సంపేట : బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని వన ప్రేమి, సామాజిక వేత్త గోకా రామస్వామి, ప్రధానోపాధ్యాయుడు పాడెం కాంతారావు కోరారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్వయంకృషి సోషల్ వర్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన ర్యాలీని ఆయనతోపాటు హెచ్‌ఎం పాడెం కాంతారావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనను సామాజిక బాధ్యతగా అభివర్ణించారు. స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఛాయా సంస్థ నిర్వాహకుడు కోట డేవిడ్, స్వచ్ఛంద వాలంటీర్ కాసుల వెంకటాచారి, ఉపాధ్యాయులు శౌరీ అసంతీన, సుజాత, నిర్మల, స్వరూప, పద్మ, శ్రీలత, దివ్య, మల్లయ్య, రాజేశ్, పీఈటీ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

భూభారతితో సమస్యల పరిష్కారం



నల్లబెల్లి: దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ కృష్ణ

- తహసీల్దార్ ముప్పు కృష్ణ

నల్లబెల్లి : భూభారతి చట్టంతో రైతుల భూ సంబంధిత సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ ముప్పు కృష్ణ తెలిపారు. మండలంలోని మేడపల్లిలో గురువారం నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరై దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండలంలోని సన్నూరు, జగన్నాధపల్లి గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్ మాట్లాడారు. రైతులు దరఖాస్తులు అందించి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఎ కిరణ్‌కుమారి, ఎంఆర్‌ఐ కొయ్యడ చంద్రమోహన్, ఏఆర్‌ఐ సంధ్యారాణి, జయంతి, లక్ష్మి, అభిలాష్, పంచాయతీ కార్యదర్శులు మురళీకష్ణ, పద్మ, శిరీష, జీపీలు ఎల్లయ్య, నర్సయ్య, అంకూస్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం



ఖానాపురం : మంజూరు పత్రాలు ఇస్తున్న శ్రీనివాస్



నర్సంపేట : మంజూరు పత్రం అందిస్తున్న ప్రభాకర్

- ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్

ఖానాపురం : కాంగ్రెస్‌తోనే పేదల సొంతింటి కల సాకారమవుతుందని కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు వల్లె శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ధర్మరావుపేటలో లబ్ధిదారులకు గురువారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసే దిశగా కార్యాచరణ అమలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజాకర్‌రావు, నాయకులు రాజు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటకు చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, నర్సంపేట డివిజన్ విద్యార్థి జేఏసీ చైర్మన్ బొక్కల నర్సింహారావు మౌనిక కుటుంబానికి ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కంచ ప్రభాకర్ అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ మేడి సంతోష్‌కుమార్, నాయకులు అబ్బదాసి సుధాకర్, అబ్బదాసి యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలి



బడిబాటలో అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు

నర్సంపేట : చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడ అంగన్‌వాడీ టీచర్ నూనె కవిత కోరారు. గ్రామంలో గురువారం నిర్వహించిన 'అమ్మ మాట–అంగన్‌వాడీ బాట' ర్యాలీలో ఆమె మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలు, తల్లులకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరిగి మూడు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ సెంటర్‌కు పంపాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా పెండ్యాల జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.